క్లుప్తంగా

నేడు కొల్లిపర మండలంలో రోడ్ షో

తెనాలిఅర్బన్: ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 4 గంటలకు కొల్లిపర మండల పరిధిలోని వల్లభాపురం, అత్తలూరివారిపాలెం, దంతలూరు, కుంచవరం గ్రామాల్లో రోడ్ షో నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

తెనాలిరూరల్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులు గురువారం నుంచి నామినేషన్లు దాఖలు చేయవచ్చని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ బుధవారం తెలిపారు. 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని చెప్పారు. పని దినాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం మూడు గంటల్లోగా నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చని సూచించారు. నామినేషన్ల సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో భారీకేడ్లు ఏర్పాటు చేస్తున్నామని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కేంద్ర బలగాలతో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయానికి 100 మీటర్ల వరకు ఎవరినీ అనుమతించమన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థితో కలిపి కేవలం ఐదుగురిని మాత్రమే అనుమతిస్తామన్నారు.

ఫుడ్ అథారిటీ పేరిట బెదిరింపులు


పోలీసులకు ఫిర్యాదు చేసిన హోటళ్ల నిర్వాహకులు

తెనాలిరూరల్: ఫుడ్ అథారిటీ పేరిట ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తుండడంపై హోటళ్ల నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తెనాలికి చెందిన పలువురు హోటళ్ల నిర్వాహకులకు ఇటీవల కాలంలో ఫుడ్ అథారటీ నుంచి ఫోన్ చేస్తున్నామని మీ హోటల్ మీద ఫిర్యాదు అందిందంటూ రూ.25 వేలు కట్టకపోతే కేసు నమోదు చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. 9985387372, 6300379366 నంబర్ల ద్వారా ఫోన్‌లు వస్తున్నాయని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఏపీ హోటల్స్ అసోసియేషన్ కోశాధికారి ఈదర వెంకట పూర్ణ చంద్, తెనాలి హోటల్స్ అండ్ ఫుడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కనిగిచర్ల రమాకాంత్, తోటకూర సుబ్రహ్మణ్యం, నందిపాటి సుధీర్ బాబు, కంచాని కొండారెడ్డి, బొమ్మారెడ్డి సతీష్ రెడ్డి, గండికోట శివప్రసాద్, అన్నవరపు సురేష్, రామకృష్ణ, వెంకటేశ్వరరావు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు.

కాలువలో మునిగి విద్యార్థి మృతి

తెనాలిరూరల్: తెనాలి మండలం సంగం జాగర్లమూడిలోని కొమ్మమూరు కాలువలో మునిగి విద్యార్థి మృతి చెందాడు. నర్సరావుపేట మండలం ఇక్కుర్రుకు చెందిన గల్లా వంశీకృష్ణ(17) వడ్లమూడిలోని ఓ యూనివర్శిటీలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. తనతోటి మరో ముగ్గురు స్నేహితులతో కలసి సంగం జాగర్లమూడి సంగమేశ్వర స్వామి దేవస్థానం వద్ద కాల్వకు బుధవారం సాయంత్రం వచ్చారు. ఈత కొడుతుండగా వంశీకృష్ణ మునిగిపోయాడు. కాపాడేందుకు అతని స్నేహితుడు చివిలిపల్లి వెంకటేష్ ప్రయత్నించినా చివరికి నీటిలో గల్లంతయ్యాడు. రాత్రికి మృతదేహం లభించింది. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జేబీఎన్‌పీ పొన్నూరు అభ్యర్థిగా వరికుంట



పెదకాకాని: జై భారత్ నేషనల్ పార్టీ పొన్నూరు అభ్యర్థిగా వరికుంట రోశయ్య ఖరారయ్యారు. పార్టీ అధ్యక్షుడు జేడీ లక్ష్మీనారాయణ రాష్ట్ర వ్యాప్తంగా 48 మంది ఎమ్మెల్యే అభ్యర్థులతో తొలి జాబితా ప్రకటించడం జరిగిందని, ఆ జాబితాలో పెదకాకాని గ్రామానికి చెందిన తనపై నమ్మకం ఉంచి పొన్నూరు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపిక చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని రోశయ్య వెల్లడించారు.

గ్రూప్-2 మెయిన్స్‌కు 48 మంది ఎంపిక

నెహ్రూనగర్: బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షకు శిక్షణ పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థుల్లో 48 మంది మెయిన్స్ పరీక్షలకు ఎంపికైనట్లు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ టి.వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 86 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, అభ్యర్థులతోపాటు, గుంటూరు జిల్లాకు చెందిన మరో 50 మంది (ఈడబ్ల్యూఎస్) అభ్యర్థులను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి వారికి స్పాన్సర్ చేయడం జరిగిందన్నారు. మొత్తంగా 48 మంది గ్రూప్-2 మెయిన్స్‌కు అర్హత సాధించారన్నారు. త్వరలో గ్రూప్-2 మెయిన్స్‌కు కూడా ఉచిత శిక్షణ ఉంటుందని తెలిపారు.

ఆలయాలలో మార్మోగిన రామనామం

- పట్టణంలో శ్రీరామనవమి ఉత్సవాలు
- రాములోరి కల్యాణాన్ని వీక్షించేందుకు తరలివచ్చిన భక్తజనం
- స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రసాదాల పంపిణీ



మారీసుపేట శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో హారతి స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: పట్టణంలోని పలు సీతారాముల దేవాలయాలను విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. చలువ పందిళ్లను తీర్చిదిద్దారు. పర్వదినాన కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. భక్తులు కనులారా గాంచారు. భక్తి శ్రద్ధలతో స్వామివార్లను దర్శించుకొని వడపప్పు, పానకం తీసుకుని తిరుగుముఖం పట్టారు.

- దొంగరాముడి గుడిగా ప్రసిద్ధి కెక్కిన గాడిబావి సెంటర్లోని శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ఉదయం 11 గంటలకు కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ ములుకుట్ల విశ్వనాథ శర్మ ప్రత్యక్ష వ్యాఖ్యానం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై భక్తి శ్రద్ధలతో తిలకించారు. రామనామ స్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కోగంటి రాంబాబు, కార్యనిర్వహణాధికారి జీవీ అమరనాథ్ పర్యవేక్షించారు.
- బోసురోడ్డులోని హనుమాన్‌చౌక్‌లో గల శ్రీ సీతారామ మందిరం వద్ద 92వ వసంత నవరాత్ర మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నవమి పర్వదినాన ఉదయం పదిన్నర నుంచి శ్రీసీతారాముల కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. విష్ణుభట్ల రత్నాకరశాస్త్రి-నీరజ దంపతులు కల్యాణం జరిపించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్ధ ప్రసాదాలు, తలంబ్రాలు అందజేశారు.
- మారీసుపేటలో అప్పలస్వామి గుడిగా ప్రసిద్ధి చెందిన శ్రీకోదండ రామస్వామి ఆలయంలో కోదండ రాముడి కల్యాణ మహోత్సవం, 28వ వసంత నవరాత్రి మహోత్సవాలను వైభవంగా జరిపారు. ఆలయ ధర్మకర్తలు లంకా శివానందకుమార్, శివాంజనేయ ప్రసాద్, నారాయణస్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను జరిపించారు. కళ్యాణోత్సవం అనంతరం మధ్యాహ్నం మూడు వేలమందికి అన్నప్రసాద వితరణ చేశారు.
- నాజరుపేటలోని వెల్లంకివారి వీధిలో సాధుపరిషత్ సమీపంలోని శ్రీ షిర్డి సాయినాథుని దేవాలయంలో శ్రీ సీతారామ కళ్యాణం కన్నుల పండువగా జరిగింది. భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.
- మారీసుపేట మఠంబజారులోని శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానం వద్ద శ్రీ సీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది. శ్రీ అభయాంజనేయ స్వామి యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవంలో భక్తులు పాల్గొన్నారు. మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు. టి.మురళి, బి.గిరిధరసాయి, లక్ష్మీనారాయణ, బి.వీరవసంతరావు, ఎస్.మణి, రబ్బానీ, టి.గోపీనాథ్, టి.సూర్య పాల్గొన్నారు.
- బాలాజీరావుపేట రామస్వామిపేటలోని శ్రీపట్టాభి రామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి మహోత్సవాలు జరిగాయి. స్థానిక భక్తులు తలంబ్రాలను సమర్పించారు. ప్రధాన అర్చకుడు వేదాంతం సుందరాచార్యులు, ఆలయ ఈవో మల్లీశ్వరి, శ్రీరామభక్తబృందం సభ్యులు పర్యవేక్షించారు.
- సుల్తానాబాద్‌లోని శ్రీ కుమార్ సాయి మందిరంలో శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా బుధవారం శ్రీ సీతారాముల కళ్యాణాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సుల్తానాబాద్‌లోని శ్రీ ఆంజనేయస్వామి మందిరం వద్ద నవమి వేడుకలు నిర్వహించారు.
- అమరావతి కాలనీలోని శ్రీగోదా పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాన్ని కన్నుల పండువగా జరిపించారు. కమిటీ సభ్యులు తుమ్మల సత్యనారాయణ, దేవాభక్తుని ఉమామహేశ్వరరావు, చిన్ని కృష్ణారెడ్డి, గడ్డిపాటి పుష్పకుమారి పాల్గొన్నారు.

వడపప్పు, పానకం పంపిణీ

- శ్రీరామ నవమి పర్వదినం, శ్రీసీతారాముల కల్యాణోత్సం సందర్భంగా పట్టణంలో స్థానికులు పలు చోట్ల స్వచ్ఛందంగా కేంద్రాలను ఏర్పాటు చేసి, భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. చెంచుపేటలోని శ్రీవెంకటేశ్వర హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ వద్ద శ్రీ సీతారాములకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపి వడపప్పు, పానకాన్ని అందజేశారు. అన్నదాత సుఖీభవ సంస్థ ఆధ్వర్యంలో బోసురోడ్డులోని చలువ పందిళ్ల వద్ద భక్తులకు వడపప్పు, పానకం పంపిణీని దీప్తి పబ్లికేషన్స్ అధినేత ఆంజనేయులు ప్రారంభించారు. జీవీ నారాయణ, మొవ్వా సత్యనారాయణ, అబ్దుల్ రజాక్, కొత్తగొర్ల శ్రీనివాసరావు, దోబా సందీప్, తుల్లిమిల్లి పోతురాజు, బాణావత్ బాలూనాయక్, ప్రధానోపాధ్యాయుడు కుర్రా శ్రీనివాసరావు, బాల సుబ్రహ్మణ్యం, కరేటి నాగేశ్వరరావు, పోతార్లంక శ్రీనివాసరావు, రాచకొండ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. స్థానిక గిరి రోడ్డులోని శ్రీసిద్ధి విఘ్నేశ్వరస్వామి మందిరం వద్ద రమేష్‌బాబు ఆధ్వర్యంలో భక్తులకు పానకం, వడపప్పు, పులిహోర పంపిణీ చేశారు. ప్రధాన అర్చకుడు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



రజకచెరువు వద్ద ఆంజనేయస్వామి దేవాలయంలో పూజల్లో ఎమ్మెల్యే

కల్యాణ వేడుకలను తిలకించిన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ తెనాలి అసెంబ్లీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ పట్టణంలోని పలు దేవాలయాల్లో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. తలంబ్రాలు పోశారు. తొలుత రజక చెరువు దగ్గర్లోని శ్రీ ప్రసన్నాంజనేయ, శ్రీ షిరిడీ సాయిబాబా దేవస్థానాల్లో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. 38వ వార్డు రజకపేటలోని శ్రీరామ మందిరం వద్ద నవమి వేడుకలకు హాజరయ్యారు. శ్రీరామచంద్ర ప్రభువు-సీతమ్మ వార్లను దర్శించుకున్నారు. కౌన్సిలరు వీర్లపాటి విజయలక్ష్మి, స్థానిక నాయకులు స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. నెహ్రూ రోడ్డులోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో జరిగిన వేడుకల్లో పాల్గొని సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. నందులపేటలోని శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానానికి వెళ్లి అక్కడి రామమందిరంలో జరిగిన కల్యాణోత్సవాన్ని వీక్షించారు. తదుపరి రామలింగేశ్వరపేటలోని పుట్టా రాఘవయ్య రైస్‌మిల్లు వద్ద గల శ్రీ సీతా సమేత కోదండ రామాలయంలో జరిగిన 52వ వసంత నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు. కళ్యాణోత్సవాన్ని వీక్షించారు. అక్కడి నుంచి బోసు రోడ్డులోని శ్రీ సీతారామ మందిరం వద్ద జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. తదుపరి మెయిన్ రోడ్డులోని గాడిబావి సెంటర్లో గల శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో జీవీ అమరనాథ్, అర్చకులు స్వాగతం పలికారు. మారీసుపేటలోని శ్రీ కోదండరామ స్వామి దేవాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు స్వాగతం పలికారు. వీరితో మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్ మొగల్ అహ్మద్, పార్టీ నాయకుడు కఠారి హరీష్ తదితరులు ఉన్నారు.

- స్థానిక షరాఫ్ బజారులోని శ్రీ సువర్చలా సమేత శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. సీతా రాములకు విశేష పూజలు చేసిన అనంతరం కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపించారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ దంపతులు, దాతలు గుడివాడ బాలకృష్ణ దంపతులు, సోమిశెట్టి పవన్ కుమార్ దంపతులు పాల్గొన్నారు. కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులందరికీ తలంబ్రాలు, అక్షితలను అందజేశారు. శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తన సభ్యులు అన్నమాచార్య కీర్తనలను ఆలపించారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.



సీతారామాంజనేయ స్వామి ఆలయంలో భక్తులకు మంగళ సూత్రాన్ని చూపుతున్న అర్చకుడు



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న మహిళలు



మారీసుపేట శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో దేవతా మూర్తులను తీసుకువస్తున్న ధర్మకర్తలు



రామస్వామిపేటలోని శ్రీ పట్టాభి రామస్వామి దేవస్థానంలో కల్యాణోత్సవం

నవ్యాంధ్ర శ్రేయస్సుకు జనచైతన్య యాత్ర



రక్త క్షేత్రంలో నివాళి అర్పించిన విమలక్క, నాయకులు

తెనాలి: ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా తదితర సమస్యలపై విప్లవ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నెల్లూరు నుంచి శ్రీకాకుళం వరకు చేపట్టిన జనచైతన్య యాత్ర బుధవారం రాత్రి బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలోని చుండూరుకు చేరుకుంది. అక్కడి రక్త క్షేత్రంలో చుండూరు మృత వీరులకు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉభయ తెలుగు రాష్ట్రాల అధ్యక్షురాలు విమలక్క పూలతో నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2021 ఆధారంగా సాక్షాత్తూ పార్లమెంటులో హామీపడ్డ ప్రత్యేక హోదాను పదేళ్లుగా అటకెక్కించారని ఆరోపించారు. నవ్యాంధ్రకు మూడో దఫా ఎన్నికలు జరుగుతున్న సమయంలో ప్రధాన పార్టీలు దీనిపై దృష్టిని కేంద్రీకరించటం లేదన్నారు. విశాఖ రైల్వే జోన్ రావాల్సిన సమయంలో ఆంధ్రుల హక్కుగా ఉన్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఉరికంబం మీద నిలబడి ఉందన్నారు. రాయలసీమ-ఉత్తరాంధ్రలకు బుందేల్‌ఖండ్ తరహా అభివృద్ధి ప్యాకేజీ జాడలేదన్నారు. అడవులు, కొండలు, తీరప్రాంతాలు, సస్యశ్యామలమైన నేలలు అనే తేడా లేకుండా అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ల పరం అవుతూనే ఉన్నాయని ఆరోపించారు. ఈ నేపథ్యంలో బాబాసాహెబ్ అంబేడ్కర్ స్ఫూర్తిని అందుకుని ఆయన 133వ జయంతి రోజున నెల్లూరు జిల్లా రావూరు మండలంలోని కండలేరు నిర్వాసిత గ్రామమైన తానంచర్ల నుంచి జనచైతన్య యాత్రను ప్రారంభించినట్టు తెలిపారు. 21 రోజుల పాటు సాగే బస్సుయాత్ర వివిధ సమస్యలు లేవనెత్తుతూ శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతకర్త అయిన కారల్ మార్క్స్ 206వ జయంతి రోజున శ్రీకాకుళం జిల్లా బొడ్డపాడు గ్రామానికి చేరి ముగుస్తుందని తెలిపారు. ప్రజా ప్రతిపక్షంగా చేస్తున్న ఈ యాత్రకు భావ సారూప్యత కలిగిన సంఘాలు, దళిత ఉద్యమ కారులు, ప్రజాస్వామిక వాదులు సంఘీభావం తెలియజేయాలని కోరారు. వీరితో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కరీం బాషా, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ, ప్రగతిశీల మహిళా సంఘం ప్రతినిధి బి.గంగ, ఏసీఎఫ్ మల్సూర్ తదితరులున్నారు. చుండూరు దళిత పోరాట కమిటీ అధ్యక్షుడు జాలాది మోజెస్ స్వాగతం పలికారు.

అభిమాన నాయకుడికి ఆత్మీయ ఆదరణ

- తెనాలి మండలం తేలప్రోలు, కంచర్లపాలెం, సోమసుందరపాలెం, నేలపాడు గ్రామాల్లో ఎమ్మెల్యే శివకుమార్ రోడ్ షో
- అడుగడుగునా ఆత్మీయ స్వాగతం పలికిన గ్రామస్తులు



విజయరథం నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిరూరల్: గ్రామాల్లో వైఎస్సార్ సీపీకి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోంది. ఎన్నికల ప్రచారానికి వచ్చిన పార్టీ నాయకులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. తెనాలి రూరల్ పరిధిలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ బుధవారం సాయంత్రం ఎన్నికల ప్రచార రోడ్‌షోను నిర్వహించారు. మండలంలోని తేలప్రోలు, కంచర్లపాలెం, సోమసుందరపాలెం, నేలపాడు గ్రామాల్లో సాగింది. సాయంత్రం 5 గంటలకు తేలప్రోలు గ్రామం నుంచి రోడ్ షో ప్రారంభించగా కంచర్లపాలెం, సోమసుందరపాలెం, నేలపాడు గ్రామాల మీదుగా ప్రచారం రాత్రి వరకు కొనసాగింది. ముందుగా తేలప్రోలులో ప్రచారాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శివకుమార్‌కు స్థానిక నాయకులు, మైనార్టీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి శివన్న విజయ రథంపై ప్రచారంలో ముందుకు సాగారు. గ్రామంలో ప్రచారానికి వస్తున్న ఎమ్మెల్యే శివకుమార్‌కు ప్రజలు సంపూర్ణ మద్దతు తెలియజేశారు. వారందరికీ అభివాదం చేస్తూ ఆయన రోడ్ షో లో పాల్గొన్నారు. అడుగడుగునా మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. రోడ్ షోను తిలకించేందుకు బయటకు వచ్చిన ప్రజలతో వీధులన్నీ నిండిపోయాయి. ప్రచారంలో భాగంగా శివకుమార్ మాట్లాడారు. గత 58 నెలల కాలంలో ప్రజలకు అందించిన సంక్షేమ ఫలాలతో పేద, మధ్య తరగతి వారి జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని పేర్కొన్నారు. ప్రచారంలో భాగంగా గ్రామాలకు వెళితే ప్రజల నుంచి వస్తున్న ఆదరణే ఇందుకు నిదర్శనమని చెప్పారు. నియోజకవర్గంలో రూ. 1800 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని 27 వేల మందికి నివేశన స్థలాలు ఇచ్చినట్టు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అదించామన్నారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమా ప్రణతి, మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, తేలప్రోలు సర్పంచ్ షేక్ భాష, ఎంపీటీసీ సభ్యులు షేక్ ఇలియాజ్, గాలబ్, యార్డ్ డైరెక్టర్ జానీ, షేక్ అరాఫత్, కంచర్లపాలెం సర్పంచ్ కోపల్లె మణిమ్మ, నాయకులు కోపల్లె సురేష్ బాబు, యర్లగడ్డ బుల్లబ్బాయ్, పాదిలి శ్రీనివాస్, కొఠవరపు దేవానంద్, కొఠవరపు రాజేష్, శివయ్య, సోమసుందరపలెం నాయకులు ధర్మరాజుల శ్రీనివాసులు, పెద్దబ్బాయ్, లుక్కా శ్రీరామ్ గౌడ్, కోటేశ్వరరావు, నేలపాడు సర్పంచ్ నాగమల్లేశ్వరరావు, తుల్లిమిల్లి మరియదాసు, అవినాష్, మన్నే యోబు, చిన్నా తదితరులతో పాటు నాయకులు గోల్డ్ రహీమా, షేక్ మీరావలి, టోపీ సుభానీ, వేణుగోపాల్, అక్కిదాసు కిరణ్‌కుమార్, యాతాటి అనిల్, షేక్ దుబాయ్‌బాబు, బొమ్మునాగిరెడ్డి, బూరెల దుర్గా ప్రసాద్, ఎస్ రఘురామిరెడ్డి, పినపాటి అనిల్ కుమార్, మేకల రవికుమార్, కోగంటి ఆషు, ఎస్‌ఆర్‌కె శర్మ, చుండూరు గోపి తదితరులు పాల్గొన్నారు.



రోడ్ షో లో పాల్గొన్న అభిమానులు



ఎమ్మెల్యేకు హారతి ఇస్తున్న మహిళ

టీడీపీ కూటమికి ఓట్లడిగే అర్హత లేదు




25వ వార్డులో ప్రచారం నిర్వహించిన అంబటి మురళీకృష్ణ

- చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మొద్దు
- వైఎస్సార్ సీపీ పొన్నూరు అసెంబ్లీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ
- 25,27వ వార్డులలో విస్తృత ప్రచారం

పొన్నూరు: నియోజకవర్గంలో పాతికేళ్ల పాలన సాగించి అభివృద్ధిని విస్మరించిన టీడీపీ కూటమికి ఓట్లడిగే నైతిక అర్హతలేదని వైఎస్సార్ సీపీ పొన్నూరు అసెంబ్లీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పట్టణంలోని 25, 27వ వార్డులలో ప్రచారం నిర్వహించారు. ముస్లిం ప్రాంతాల్లో పర్యటించి ఆప్యాయంగా వారిని పలకరించారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నాయకులు అంబటి మురళీకృష్ణకు ఘన స్వాగ తం పలికి గజమాలతో సత్కరించారు. శ్రీరామ నవమి సందర్భంగా శ్రీ రామాలయాల్లో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి వీధిలో అంబటికి మహిళలు హారతులిచ్చి విజయతిలకం దిద్దారు. వార్డుల్లోని ప్రతి గడపకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని, తన సొంత డైరీలో రాసుకున్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం వెంటనే సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపడతానని ప్రజలకు హామీ ఇచ్చారు. జగనన్న అమలు చేసిన నవరత్నాల పథకాల లబ్ధిని వివరించారు. అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ఎన్నికలలో ఓట్లకోసం అమలు కు నోచుకోని హామీలిస్తున్న చంద్రబాబు కూటమి చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని తెలిపారు. గత రెండేళ్లుగా సేవా కార్యక్రమాలతో నియోజకవర్గ ప్రజలకు అండగా నిలిచానని గుర్తు చేశారు. నియోజకవర్గంలో సుదీర్ఘకాలంగా ఉన్న సమస్యలను వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో పరిష్కారానికి నోచుకున్నాయని వివరించారు. ఎమ్మెల్యేగా తనను గెలిపించి ఒక్క అవకాశం ఇస్తే నిరంతరం ప్రజలకు అండగా ఉంటానని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న వైఎస్సార్సీపీని ఆశీర్వదించాలని కోరారు. 2019 ఎన్నికలకు ముందు పాదయాత్రలో ప్రజలకిచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ప్రచారంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యులు షేక్. సైపుల్లా, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు ఎంఏ. మహమూద్, నాయకులు షేక్. మాము, బొనిగల వేణుప్రసాద్, షేక్. నాజర్, వడ్రాణం ప్రసాదు, అమిరినేని సాంబశివరావు, అంబటి వెంకటేశ్వర్లు, ఎందేటి వెంకట సుబ్బయ్య, బోయి నాగరాజు, మొల్ల కరీం, వట్టిప్రోలు రంగారావు, బొద్దులూరి రంగారావు, గేరా సంజీవ్, దేవరకొండ గోపి, ఆకుల రామ్మోహన్ పాల్గొన్నారు.

రాములోరి పెళ్లికి అతిథిగా వచ్చిన వానరం

పెదకాకాని : శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీసీతారాముల కల్యాణ వేడుకలు అర్చకులు శాస్త్రోక్తముగా జరిపించారు. పెదకాకాని సదాశివకాలనీలోని రామాలయం వద్దకు బుధవారం సీత రాముల కల్యాణ వేడుక జరుగుతున్న సమయంలో ఆలయంలోకి వానరం (కోతి) వచ్చి భక్తులను ఆశ్చర్యానికి గురి చేసింది. సదా శివకాలనీలో చోటు చేసుకున్న ఈ సంఘటన భక్తులను ఆనందింపజేసింది. సాంప్రదాయబద్ధంగా వేద మంత్రోచ్చారణ మధ్య కల్యాణం జరిగినంత సేపు అక్కడే ఉండి వీక్షించింది. కల్యాణం పూర్తి అయిన అనంతరం ఆ వానరం సీతమ్మవారి పాదాలు తాకి కేవలం ప్రసాదం మాత్రమే తీసుకొని అక్కడి నుంచి వెళ్లిపోయింది. పూజా కార్యక్రమాలు సమయంలో భక్తులను ఎటువంటి భయభ్రాంతులకు గురిచేయకపోవడంతో సాక్షాత్తు ఆంజనేయ స్వామి వచ్చి ప్రసాదం స్వీకరించినట్లుగా భక్తులు భావిస్తున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులందరికీ పానకం, వడపప్పు, పులిహోర ప్రసాదంగా పంపిణీ చేశారు.



మత సామరస్యంలోనే ఆనందం

గుంటూరు మెడికల్ : మత సామరస్యంలో ఉన్న ఆనందం కంటే మరొకటి ఉండదని గైనకాలజిస్ట్, ఫెర్టిలిటీ స్పెషలిస్ట్, హోప్ విన్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ షమ సుల్తాన అన్నారు. తండ్రికి ఇచ్చిన మాట కోసం రాజ్యాన్నే త్యజించిన గొప్ప పాలకుడు శ్రీరామచంద్రుడు అని ఆమె కొనియాడారు. శ్రీరామనవమి పండుగ సందర్భంగా బుధవారం గుంటూరు నగరంలోని పలు ప్రాంతాల్లో పాదచారులు, వాహనదారులకు డాక్టర్ షమ సుల్తాన మజ్జిగ పంపిణీ చేశారు. దీంతో మండుటెండలో మజ్జిగ ఇచ్చి దాహాన్ని తీర్చిన డాక్టర్ షమ సుల్తానకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాముని కాలంలో ధర్మం నాలుగు పాదాలపై నడిచిందని, ఈ నేపథ్యంలో రాముని వంటి రాజు కోసం, రామరాజ్యం నాటి పాలన కోసం నేటికీ ప్రజలు పరితపిస్తుంటారని అన్నారు. భారతదేశంలోని నేటి రాజకీయ నాయకులు ప్రతి ఓటర్‌ను తమ ఓటు బ్యాంకుగా మార్చుకునేందుకు అన్నదమ్ముల్లా..అన్నాచెల్లెళ్లలా కలిసిమెలిసి ఉంటున్న తమను కులాలు, మతాల పేరుతో విడదీస్తున్నారని అలాంటి కుట్రలకు తాము అవకాశం ఇవ్వమన్నారు. హోప్ విన్ హాస్పటల్ మేనేజర్ పి. నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.